క్లుప్తంగా

5న విజయవాడలో హైందవ శంఖారావం



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

పాలకొల్లు అర్బన్: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, ఏపీ శాఖ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు జక్కంపూడి కుమార్, కేవీ ఎస్ఎల్ నరసింహరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. సభకు హాజరయ్యే వారికి ఆ రోజు ఉదయం 6 గంటలకు పాలకొల్లు నుంచి బస్సులు బయలుదేరనున్నాయన్నారు. కార్యక్రమంలో బోడ సత్యజిత్, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



వనమాల శ్రీనివాసరావుకి పూల బొకే ఇస్తున్న బీసీ సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చే యాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, జాతీయ ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్‌లకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, నాయకులు వింజరపు శంకరం, కోరుకొండ సుబ్బారావు, తమ్మిరి వెంకటేశ్వరరావు, నీలంశెట్టి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

27న చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీవీఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవరణలో ఈ నెల 27న దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రైనీ సూపర్‌వైజర్స్, గ్యాడ్యుయేట్ అప్రంటీస్ ఉద్యోగాలకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), బి.ఫార్మసీ, బీ.టెక్(కెమిస్ట్రి), ఎంఎస్సీ (ఆర్గానిక్) అర్హత ఉన్న వారు ఇంటర్వ్యూకి నేరుగా హాజరు కావాలని ఆయన కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పెనుగొండ: డిసెంబరు 21,22 తేదీలలో వారణాసిలో బెనారస్ హిందూ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 9వ జాతీయ కరాటే పోటీల్లో పెనుగొండ అకాడమి విద్యార్థులు ప్రతిభను కనబరిచి పతకాలు సాధించినట్లు కేఎస్ మార్షల్ అకాడమి చైర్మన్ డాక్టర్ కే శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ అకాడమి నుంచి పెనుగొండ, తణుకు నుంచి వెళ్లగా పెనుగొండకు చెందిన ఐదుగురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు వివరించారు. అండర్ 8 కేటగిరీలో జె.వైష్ణవి బంగారు, కాంస్య పతకాలు, పి.మోహన్ వెండి, కాంస్య పతకాలు, వై.అవిదత్త వెండి పతకం, కె.హర్షవర్ధన్ వెండి పతకం, కె.సిద్ధార్థ వెండిపతకాలు సాధించినట్లు తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ ఉత్తరప్రదేశ్ గెలుచుకోగా, మొదటి రన్నరప్ ట్రోఫీని ఆంధ్రప్రదేశ్ టీం గెలుచుకున్నట్లు తెలిపారు. పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి 1200 మంది పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన పెనుగొండ విద్యార్థులను పలువురు అభినందించారు.

ఆస్తి పన్నుల నోటీసుల జారీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలో ఆస్తి పన్నుల చెల్లింపుదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. మంగళవారం కమిషనర్ వార్డు పర్యటనలో భాగంగా వార్డు సచివాలయాల ఉద్యోగులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు వసూళ్లపై దృష్టి పెట్టాలని చెప్పారు. పన్నులు దీర్ఘ కాలంగా బకాయిలు ఉన్న వారి విషయంలో మున్సిపాలిటీ కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఐ నానాజీ తదితరులు ఉన్నారు.

మాటల కోటలు..అభివృద్ధి పనులకు బీటలు

- అభివృద్ధి పనులను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- నాడు-నేడు పనులను నిలిపేసిన వైనం



మొగల్తూరు ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం

మొగల్తూరు: 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మండలంలో ఎక్కడి పనులను అక్కడే నిలిపేసింది. ఎన్నికల ప్రచారం కూటమి నాయకుల మాటలు ఘనంగా చెప్పినా అధికారంలో వచ్చాక అభివృద్ధి పనులు అస్సలు చేయడం లేదు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ హయాంలో మొదలుపెట్టిన పనులను ఆపేసింది. కానీ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి మండలంలోను ఇండోర్ స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులో ఉంచాలని చేపట్టిన స్టేడియం పనులు అసంపూర్తిగా నిలిపేసింది. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచే విధంగా చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయినా పూర్తి చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం

ప్రతీ మండలానికి ఒక ఇండోర్ స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులో ఉంచాలని గత టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా 2017లో అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేయడంతో అప్పటి ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు స్టేడియం పనులకు మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో శంకుస్థాపన చేశారు. ఈ స్టేడియంలో వాకింగ్ ట్రాక్, షటిల్, వాలీబాల కోర్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు మధ్యలో నిలిచిపోవడంతో క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రీడావికాసానికి తోడు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతోగానో ఉపయోడపడే ఇండోర్ స్టేడియం పనులు మధ్యలో నిలిచిపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రస్తుతం అసంతృప్తిగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం విద్యార్థులు సైకిల్స్ ,ఉపాధ్యాయుల వాహనాలు పెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది.

నాడు-నేడు పనులు సైతం

ఇండోర్ స్టేడియం బాటలోనే నాడు-నేడు పథకంలో చేపట్టిన పనులు కూడా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో మొదటివిడత కింద కొన్ని పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసింది. అయితే నాడు-నేడు పథకంలో రెండో విడత చేపట్టిన 10 పాఠశాలల పనులు నిలిచిపోయాయి. మండలంలోని 68 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు ఉండగా మొదటి విడతలో రూ.3.83 కోట్లలో 18 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో 46 పాఠశాలలు, 10 అంగన్ వాడీ కేంద్రాలను రూ.17.83 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపడంతో నిధులు మంజూరై పనులను కూడా ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పనులను కూడా నిలిపేసింది. ముఖ్యంగా మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.52 లక్షలతో చేపట్టిన నాలుగు అదనపు తరగతి గదుల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రత్యేక దృష్టి సారించి ఇండోర్ స్టేడియం పనులతో పాటు నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు



శాంతాక్లాజ్ వేషధారణలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

పాలకొల్లు అర్బన్: క్రైస్తవులకు అత్యంత పండుగల్లో ఒకటైన క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఉల్లంపర్రు డా. సబితా జూనియర్ కళాశాల, మాంటిస్సోరీ స్కూల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవ.టీఎస్ఆర్ ప్రసాదరెడ్డి క్రిస్మస్ సందేశాన్నిచ్చారు. మాంటిస్సోరీ విద్యాసంస్థల అధిపతులు ఎంఎస్ వాసు, ఎం రాంప్రసాద్, ప్రిన్సిపాల్ సామవేదం వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కుపేట సియోను చర్చిలో పిల్లల క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో వీధుల్లో ర్యాలీ చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండ క్రీస్తు సంఘం, బైబిల్ ఓపెన్ యూనివర్సెస్ ఆధ్వర్యంలో నక్కా వినోద్ కుమార్ సారధ్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణ, ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, డాక్టర్ అన్నపూర్ణలు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బైబిల్ యూనివర్శిటీ ఇండియా ఇంటర్నేషనల్ ఆంధ్రాజోన్ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ కె.ఉపేంద్ర క్రిస్మస్ సందేశం అందించారు.

భూ సమస్యల పరిష్కారానికి దోహదం



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. నరసాపురం మండలంలోని దర్బరేవు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ అధికారులే మీ గ్రామానికి వచ్చి సమస్యలపై అర్జీలు తీసుకుంటున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పట్టాదార్ పాస్ పుస్తకాల మంజూరు, భూ సర్వే, భూమి కొలతలు, సర్వే నెంబర్లలో కొలతల్లో తేడాలు, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ధర్బరేవు గ్రామంలో జరిగిన సభలో 53, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన రెవిన్యూ సదస్సులో 3 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్‌ఓలు మెహర్‌బాబా, చిరంజీవి, వెంకటేశ్వర్లు, బాలాజీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలి



పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణం తగ్గించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి సర్కారు తగ్గించే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఈ నెల 27న ఎలక్ట్రికల్ ఏడీఈ కార్యాలయాల వద్ద పోరుబాట ఉద్యమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచమని చంద్రబాబు హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఆరు నెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపారని వివరించారు. మరో వైపు నిత్యావసర సరుకులు కూడా పెంచి ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమాన్ని కూటమి సర్కారు ప్రజలకు బహుమతిగా ఇచ్చిందని గుడాల గోపి విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో యూనిట్‌కి రూ.2.49పైసలు ఉంటే ప్రస్తుతం కూటమి సర్కారు రూ.5వరకు పెంచిందని ఆరోపించారు. సూపర్ 6 పథకాల అమలు అటకెక్కించారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ని ఆవిష్కరించారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉచ్చుల స్టాలిన్, ఖండవల్లి వాసు, జోగాడ ఉమామహేశ్వరరావు, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ, కోట రత్నరాజు, దేవ రాజేష్, తొండ శ్రీనివాస్, చెన్ను విజయ్, కోరాడ శ్రీనివాసరావు, నంబూరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీస్తు నేడు పుట్టెను

చర్చిలన్నీ క్రిస్మస్ సందడి ముస్తాబయ్యాయి. బుధవారం క్రిస్మస్ కావడంతో మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ముఖ్యంగా నరసాపురంలోని మొగల్తూరు రోడ్డులో ఉన్న 100 ఏళ్ల నాటి లూథరన్ చర్చి వద్ద చేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంటుంది. పలు కూడళ్లలో క్రిస్మస్ స్టార్‌లు ఏర్పాటు చేశారు. అలాగే క్రైసవు ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్‌లు ఏర్పాటు చేసుకున్నారు.

సాక్షి, నెట్ వర్క్



పాలకొల్లు సెంట్రల్: శంభునిపేట లూథరన్ చర్చి



పెనుగొండ: విద్యుత్ దీపాలంకరణలో సిద్ధాంతం చర్చి



పెనుగొండ: జిన్నూరు చర్చిలో ఏర్పాటు చేసిన పూరి పాక



నరసాపురం: విద్యుత్ అలంకరణలో లూథరన్ చర్చి

దాతల సాయం కోసం ఎదురుచూపులు



మోహనరావు(53)

పెనుగొండ: రోడ్డు ప్రమాదం ఓ వ్యవసాయ కూలీ జీవితాన్ని చిన్నాభిన్నం చేసింది. వైద్యం కోసం సర్వమూ కోల్పోయి దీనావస్థలో దాతల సహాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నాడు. పెనుగొండ మండలం ములపర్రుకు చెందిన వ్యవసాయ కూలీ వేండ్ర మోహనరావు ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మోటారుసైకిల్‌పై వస్తూ దమ్ము ట్రాక్టరును ఢీకొనడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాలిలో రక్త ప్రసరణ జరగకపోవడంతో ప్రమాదం జరిగినపుడే కాలు తొలగించారు. ఇటీవల కాలంలో రెండో కాలికి సైతం రక్త ప్రసరణ ఆగిపోవడంతో తమిళనాడడు రాయివెల్లూరులోని క్రిస్టియన్ ఆసుపత్రిలో రెండో కాలు కూడా తొలగించారు. ఏడాది కాలంగా వైద్య ఖర్చులు తట్టుకోలేని నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితిల్లో సొంతింటిని తాకట్టు పెట్టి మరీ వైద్య ఖర్చులకు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం మొత్తం రోడ్డున పడడంతో వైద్యానికి ఖర్చులు లేని పరిస్థితుల్లో దీనావస్థను ఎదుర్కొంటున్నారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు మూడు చక్రాల బ్యాటరీ వెహికల్ ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేయాలను వారు 79972 70137 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

వరి రైతు గుండెల్లో గుబులు



శిరగాలపల్లిలో యంత్రంతో వరికోత కోస్తున్న దృశ్యం



గుంపర్రులో ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్న వాతావరణం

యలమంచిలి: వరి సాగు చేసిన రైతులను వాతావరణం ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. గత మూడు రోజులుగా ఆకాశంలో వాతావరణం కారు మబ్బులు కమ్మి, చెదురుమదురు జల్లులు పడడంతో వరి కోత కోయని రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇప్పటికే కోతలు కోసి, ధాన్యం నూర్చి పొలంలో కల్లాలపై ఉన్న వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. సార్వా పంటలో మండలంలో వరి 4412 ఎకరాలలో సాగుచేయగా ఇంతవరకు 2780 ఎకరాలలో కోతలు పూర్తయ్యాయి. కోతలు కోయని రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని వారం రోజులుగా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అధికారులు హెచ్చరికల నేపథ్యంలో వర్షానికి ఇబ్బందులు పడతామనుకుంటున్న కొంత మంది రైతులు పచ్చిగా ఉన్న తమ ధాన్యాన్ని పొలంలోనే చౌకగా అమ్మేశారు. ఈ వాతావరణం వల్ల రైతులంతా ఒక్కసారే ధాన్యం బస్తాలు పట్టి ఇంటికి చేరవేసే కార్యక్రమం చేపట్టడంతో కూలీలకు కూడా గిరాకీ ఏర్పడింది. చేతికి వచ్చిన ధాన్యాన్ని చివరిలో వర్షానికి తడిచేలా చేయడం ఎందుకని దూర ప్రాంతాల నుంచి కూడా కూలీలను రప్పించి ఇంటికి చేరవేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రోజురోజుకీ వాతావరణంలో మార్పులు వస్తుండడంతో రైతులు పంట దెబ్బతినకుండా అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



కల్లాల్లో ధాన్యం ఉన్నట్లయితే వెంటనే సురక్షిత ప్రాంతలకు తరలించాలి. అలా వీలు కాని పక్షంలో సంబంధిత రైతు సేవా కేంద్రం ద్వారా కనీస మద్దతు ధర్పై తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోవచ్చు. ఒక వేళ ధాన్యం పొరపాటున తస్తే రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

– చిందులూరి దేవి, మండల వ్యవసాయాధికారి

యంత్రాలు ఉన్నా ఏం చేయాలేకపోతున్నాం



ప్రతి ఏడాది డిసెంబర్ నెలాకరుకు కోతలు పూర్తయ్యేవి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో కోతలు పూర్తవ్వలేదు. మాకు వరికోత యంత్రాలు ఉన్నాయి. కోతలు త్వరగా కోద్దామంటే వాతావరణం అనుకూలించడం లేదు. దీని వలన దాళ్వా పంట ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది.

– బాలం అంజిబాబు, మేడపాడు

పరిపాలనా విధానాలపై అవగాహన

నరసాపురం: ప్రభుత్వాల పరిపాలనా విధానాలపై విద్యార్థులు అవగాహనతో ఉండాలని సూర్యా డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బి.రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్వపరిపాలన(గుడ్ గవర్నెన్స్) కార్యక్రమాన్ని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయ్ జయంతి సందర్భంగా స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పిన్సిపాల్ టి.కృష్ణ, నెహ్రూ ఎన్ఎస్ఎస్ పీఓ బి.రాజేంద్రప్రసాద్, వలంటీర్ కోసూరి రాజేష్ పాల్గొన్నారు.

పెద్దిరాజుకి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన రిటైర్డు బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఉద్యోగి, అభ్యుదయ కవి, అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు కోలాటి చినపెద్దిరాజుని తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డుతో సత్కరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ఈ నెల 22న సంస్థ చైర్మన్ డా.యూవీ రత్నం, అవార్డు కమిటీ చైర్మన్ డా.ధనాశి ఉషారాణి తదితరులు తనను అవార్డుతో పాటు జ్ఞాపిక అందజేసి సత్కరించినట్లు పెద్దిరాజు తెలిపారు.

రోగులకు వసుధ ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు రోగులకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆర్థిక సహాయం చేశారు. ఈ సహాయాన్ని పాలకొల్లు కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు ఆధ్వర్యంలో మంగళవారం పాలకొల్లు కార్యాలయంలో అందజేశారు. అల్లవరం మండలం గోడిలంక గ్రామానికి చెందిన రుద్రరాజు సూర్యకాంతం కండరాల వ్యాధితో బాధపడుతున్నారు. ఈమెకు రూ.20 వేలు చెక్కును ఆ గ్రామ సర్పంచ్ రుద్రరాజు పవిత్ర లక్ష్మీపతిరాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు (గోడిలంక సత్తిబాబు) చేతుల మీదుగా అందజేశారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రెల్లుగడ్డ గ్రామానికి చెందిన నడింపల్లి సత్యనారాయణరాజుకి రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.